# చరమాంకం

సోమశేఖరం గారు యింటిదగ్గర బయల్దేరినప్పుడు గంట సరిగ్గా అయిదున్నర. ఆయన తిన్నగా మాదాగుడివీధి వెంబడి హైరోడ్డుదాకా నడిచి బంకులో ఓ వారపత్రిక కొనుక్కొని దగ్గర్లో ఉన్న పార్కులోనికి వెళ్ళి సిమెంట్ బెంచీపైన కూర్చున్నారు.

ఆకాశవాణి మనసు కందని మహోన్నత భావాలకు సంగీతానువాదం లాంటి ప్రఖ్యాత విద్వాంసుడి నాదస్వర కచ్చేరీని వినిపిస్తోంది. సంజకెంజాయల పసిడి వెలుగుల్లో పార్కు పార్కంతా ఒకే ఒక పూలగుత్తిలా కనిపిస్తోంది. చింతలకూ, వంతలకూ చోటులేని ఆనందలోకాలకు ఏలికల్లాంటి కుర్రవాళ్ళు కొందరు పచ్చిక జొంపాలపైనబడి దొర్లుతున్నారు....

సోమశేఖరంగారు ఆదినుంచీ చివరి వరకూ పత్రిక వోసారి త్రిప్పి చూడదలచుకున్నారు. కానీ ఆ లోపలే పత్రిక ఆయన చేతిలోంచి జారిపోయింది. ఒడ్డున పడివుండి తరంగం వెంట సముద్రంలోకి వెళ్లిపోయే వస్తువులా మనసు సంగీతం వెంట కదలిపోవడం వల్ల నైతేమి, సాయంకాలపు సహజ సౌందర్యం తమ రసికహృదయానికి గలిగింతలు పెట్టడంవల్లనైతేనేమి, ఆయన అవశులై అరమోడ్పు కళ్ళతో అలాగే సిమెంటు బెంచీ కానుకొని కూర్చుండిపోయారు.

కాలం గడిచిపోతుందన్న స్పృహైనా లేకుండా సోమశేఖరంగారలా కూర్చొని ఉండగానే సూర్యుడస్తమించాడు. సంధ్య మంచులా కరిగిపోయిన కొద్దీ అంధకారం లోకంపైకి విజృంభించింది. చీకటి రాకాసిపైకి మానవుడు ప్రేల్చిన మండుతున్న తూటాలకు మల్లే పట్టణమంతటా విద్యుద్దీపాలు వెలిగాయి. సోమశేఖరంగారు కళ్ళు తెరచి మళ్ళీ ఈలోకంలో పడేసరికి నాదస్వరం పూర్తయి రేడియోలో గ్రామస్థుల కార్యక్రమం వినిపిస్తోంది. అదీ, దాని తర్వాత దైనిక వార్తా విశేషాలు ప్రసారితమయ్యే వరకూ పైకి లేవకపోవడం సోమశేఖరం గారి అలవాటు. అప్పటికి గంట ఏడున్నర అవుతుంది. అప్పుడు పైకి లేచి వచ్చినదారివెంటనే గృహోన్ముఖులై ఇల్లు చేరుకునేసరికి ఎనిమిది గంటల సైరన్ మ్రోగుతుంది. అది సోమశేఖరం గారి యింట్లో భోజనవేళ. మనుమళ్ళు, మనుమరాళ్లూ ఆయన కోసం ఎదురుచూస్తూ ఉంటారు. బుజ్జాయి, చిట్టివాడూ, రమేషూ ఓవైపున – అమ్మణ్ణి, అరవింద, శారదా మరోవైపున కూర్చుంటే హారంలో నాయకమణిలా సోమశేఖరంగారు మధ్యలో కూర్చుంటారు. వడ్డించే వంతు రాజ్యలక్ష్మమ్మది! పిల్లల్లో ఆయనా ఒక్కరైపోయి భార్యకు వూపిరి సలుపకుండా పనులు పురమాయిస్తారు సోమశేఖరంగారు – "చిట్టిగాడికి మరొకాంచెం పచ్చడి వేయగూడదూ?.... అమ్మణ్ణికి నెయ్యి వెయ్యనేలేదే!....నాదగ్గర నీళ్ళ గ్లాసేదీ!...."

మాటిమాటికీ గుంజిళ్ళు పెట్టలేక "మీరు మరీ కుర్రవాళ్ళయి పోతున్నారండీ రానురానూ" అంటూ విసుక్కుటుంది రాజ్యలక్ష్మమ్మ.

"చూశావా రాజ్యం! నేను ఉద్యోగం చేస్తున్న రోజుల్లో నువ్విలా విసుక్కునేదానివేనా? అడుగులకు మడుగులొత్తే దానివి. ఇప్పుడు నేనూ నీతోబాటు యింట్లో కూర్చోబట్టి యింతగా అలుసైపోయాను. అందుకే మరి, ఉద్యోగం పురుషలక్షణం అన్నారు పెద్దలు...."

"అబ్బే, మీరిలా అనుకుంటారని తెలిస్తే, నేనామాట అనేదాన్నే కాదండీ!...." అంటూ నొచ్చుకుంటుంది రాజ్యలక్ష్మమ్మ. అయినా ఈయన గారిదిలాంటి జేలమనసని ఆమెకు మాత్రమేం తెలుసు?

రిటయిర్డు డి.ఎస్.పి. సోమశేఖరంగారు పూర్వాశ్రమంలో బండరాతిలా కర్కశులని ప్రతీతి. నిజమే! ఆయన బూట్ల చప్పుడుకు భూమి కంపించేది. పొగచుట్ట కాలుస్తూ ఆయన రూక్షవీక్షణాలు బరపితే ఎదుట నిల్చున్న క్రింద ఉద్యోగి గడగడ లాడిపోయేవాడు. ఉద్యోగ జీవితంలోనే కాదు. ఆయన యించుమించు యింట్లో గూడా అలాగే సంచరించేవారు. నేరం చేయగా పోలీసులు పట్టితెచ్చిన నేరస్థుడిపట్ల ఎలాగైతే నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించేవారో, అలాగే తప్పు చేసినప్పుడు తన బిడ్డనైనా కఠినంగానే దండించేవారు. కాని ఉద్యోగ విరమణతోబాటు, ఆయన తమ కర్తవ్యదీక్షను గూడా విస్మరించారేమో మరి! ఇప్పుడాయన దుందుడుకులైన మనుమళ్ళపైన, మంకుపట్టు పట్టే మనుమరాళ్లపైన తల్లిదండ్రులు చేయి చేసుకోడానికి వీల్లేకుండా కాపున్న అంగరక్షకుడు. వాళ్ళ ఆటలకు రెఫ్రీగా, పాటలకు ప్రధాన శ్రోతగా వ్యవహరించే వేడుక చెలికాడు. ఇంకేముంది! ఆయన నాలుగు కాళ్ళతో గుర్రంలా తయారై ఏ చిట్టిగాడినో, ఏ అమ్మణ్ణినో వీపుపైన ఎక్కించుకుని, వేగంగా వెళ్ళనందుకు వాళ్ళచేత దెబ్బలు తినడమొకటే తరువాయి.

రేడియోలో గ్రామస్థుల కార్యక్రమం గూడా ముగిసింది.

బెంచీలో చేరగిలబడి కూర్చున్న సోమశేఖరంగారు వార్తల్ని సావధానంగా వినడానికి వీలుగా సర్దుకుని కూర్చున్నారు. అలా సర్దుకుంటూ ఉండగా కానుగచెట్టు నీడలో నిల్చుని తనవైపు చూస్తున్న ఆకారం ఒకటి ఆయనకు కనిపించింది. కళ్ళజోడు సవరించుకుంటూ ఆయన "ఎవరక్కడ?" అన్నారు.

"తెలియడంలేదా సోమశేఖరం! ఎలా తెలుస్తుంది? ఏండ్లూ, పూండ్లూ గడిచిపోయిన మాట నిజం! బహుశా మరచిపోయి ఉంటావు...." నీడలో నుంచీ ఆ ఆకారం ఈవలికి వచ్చింది.

ఇంత చనువుగా తనను పలకరిస్తున్న ఆ వ్యక్తికేసి చూస్తూ నివ్వెరపడిపోయారు సోమశేఖరంగారు. అతగాడు ఆరడుగుల మనిషి. తలపైన టోపీ పెట్టుకున్నాడు. నల్లద్దాల కళ్ళజోడులో కళ్ళను పదిలపరచుకున్నాడు. ఏటవాలుగా క్రిందికి దిగి, చుబుకం దగ్గర కలుసుకుని 'వి' ఆకారంలో అమరివున్న చెంపల మీద క్రొత్తగా గడ్డాన్ని సాగు చేస్తున్నాడు. తొడుక్కున్నది పొడుగాటి సిల్కు జుబ్బా, కానీ అది బాగా మాసిపోయినట్టుంది. చేతిలో ఒక తోలుసంచి తప్పితే అతడి వెంట సామాన్లేవీ లేవు. మనిషి మాత్రం క్రిక్కిరిసిన రైలు బండితో వందలకొలది మైళ్ళు ప్రయాణం చేసి అలసిపోయినట్టున్నాడు. ఇన్ని వివరాలూ ఒక్క చూపుతోనే తెలిసివచ్చాయి సోమశేఖరం గారికి! కానీ ఈ వివరాలలో నుంచీ యితడెవరన్న ప్రశ్నకు సమాధానం మాత్రం లభించింది గాదు....

"ఆశ్చర్యమేమిటంటే సోమశేఖరం, పదిహేనేళ్ళకు మునుపు మనం చివరిసారి కలుసుకున్నప్పుడు నువ్వెలాగైతే ఉన్నావో, యిప్పుడూ అలాగే ఉన్నావు. కించిత్తు మార్పయినా లేదంటే నమ్ము! అవును మరి, నీడపాటున బ్రతికినవాడివి. తల్లిదండ్రుల మాట జవదాటని బుద్ధిమంతుడైన కుర్రవాడివి,హద్దులు దాటనివాడివి, రాజవీధిలాంటి బ్రతుకుబాటను ఎన్నుకున్నవాడివి. నీలో మార్పెందుకొస్తుంది? అన్ని మార్పులకూ రంగస్థలం వంటి వాణ్ణి నేను! లేకుంటే నాలుగైదేళ్ళపాటు ఒకే తరగతిగదిలో కూర్చున్న సహ పాఠకుడే నన్ను గుర్తుపట్టలేకపోయేవాడా సోమశేఖరం!"

సోమశేఖరం గారు అయోమయంలో పడిపోయారు. ఐతే యితగాడు తనతో కలిసి చదువుకున్న వాడన్నమాట! ఐనా అది ఏనాటి ముచ్చట! అరవయ్యేళ్ళ సోమశేఖరం గారి

మనసులో నలభై అయిదేళ్ళనాటి తరగతి గది ప్రత్యక్షమైంది. సహపాఠకులు కొందరు మెరపుల్లా మెరసిపోసాగారు. చిలిపికళ్ళ రంగనాథం ఒకడు. మరొకడు చలపతి. ఆర్మీలో ఉద్యోగం చేస్తూ ఏదో ప్రమాదంలో చనిపోయాడు. వేరొకడు తారకం. ఇంకొకడు కృష్ణమూర్తి. పాఠశాల నుండి విడిపోయిన తరువాత గూడా ఈ నలుగురితో తనకు ఉత్తర ప్రత్యుత్తరాల సంబంధం ఉండేది. ఇంతగా సన్నిహితం గాని మిత్రులు గూడా మరికొంతమంది ఉ ండవచ్చు. ఉదాహరణకు గు......గు.....

సోమశేఖరంగారి కళ్లల్లో పూర్వ స్మృతి ఒకటి తళుక్కున మెరిసింది. ఆయన ఆగంతుకుడి దగ్గరికి జరిగి "పట్టేశాను లేవోయ్! గుర్తుపట్టేశాను. కావలిస్తే పందెం కట్టడానికి కూడా సిద్ధమే! సందేహం లేదు. నువ్వు గురుమూర్తివి!" అన్నారు.

"పందెం కట్టినట్టయితే నేను నువ్వనుకుంటున్న గురుమూర్తిని కానని గూడా బుకాయించగలను సోమశేఖరం! అలా బుకాయించి నేను స్నేహితుల నుంచీ పారిపోయిన ఘట్టాలు చాలా ఉన్నాయి...." కళ్ళజోడు చేతికి తీసుకుని మెల్లగా నవ్వుతూ చెప్పుకుపోసాగాడు గురుమూర్తి. "ఎందుకంటావేమో! వాళ్ళ పరామర్శలకు తట్టుకోలేక! ఎక్కడున్నావు, మొదటి ప్రశ్న. ఏం చేస్తున్నావు? రెండో ప్రశ్న. బిడ్డలెందరు? మూడో ప్రశ్న. అక్షయ తూణీరంలో తీస్తున్నకొద్దీ బాణాలే! ఇక్కడ జవాబు చెబుతున్నకొద్దీ ప్రశ్నలే!"

బాల్యస్నేహితుడి వింతధోరణికి అంతరార్థమేమిటో లీలగానైనా స్ఫురించిక, సోమశేఖరంగారు విస్తుపోయిన మాట వాస్తవం. చాలాకాలం తర్వాత మిత్రులిద్దరు ఒకచోట తారసిల్లితే సాధారణంగా అలాగే పరామర్శించుకుంటారు. తన ఆలోచన పారినంత వరకూ అందులో విడ్డూరమేమీలేదు. మానవమాత్రుడంటూ ఒకడున్న తర్వాత అతడెక్కడో ఒకచోట నివసించక తప్పదు. జీవనోపాధికి ఏదో వృత్తిని స్వీకరించక తప్పదు. ఇక పెళ్ళీ పెటాకులూ లేకుండా బ్రహ్మచారిగా కాలం గడపడమనేది ఎవడికో ఋషితుల్యుడికి గానీ సాధ్యంగాని పని. పెళ్ళి జరిగిన తర్వాత దంపతుల ఆరోగ్యంలో లోపం ఉంటే తప్ప, సంతానం కలగడం ఖాయం. ఉద్యోగం, వివాహం, సంతానం....యివన్నీ జీవితయాత్రలో ప్రధాన ఘట్టాలు. పోగా ఇవి మూకిట మూసిపెట్టుకోవలసిన అంతరంగిక విషయాలేమీ కావు. వ్యక్తి సంఘంలో తానూ ఒక్కడుగా కలిసి మెలిసి తిరుగుతున్నంత కాలం వీటికి సంబంధించిన ప్రశ్నలకు జవాబిచ్చుకోక తప్పదు.

గురుమూర్తి జేబులోనుంచీ రెండు పొగచుట్టలు తీసి ఒకటి సోమశేఖరంగారి కిచ్చి, మరొకటి తను ముట్టించాడు. లోపలా, బయటా గూడ వ్యాపించిన వెచ్చటి పొగలోనుంచీ ఉత్తేజాన్ని సమకూర్చుకున్నట్టుగా ఈసారి కాస్తా ఉత్సాహంలో ప్రారంభించాడు.

"కానీ యిప్పుడు నాకునేనై నిన్ను వెదుక్కుంటూ వచ్చాను సోమశేఖరం! అంటే ఏమన్నమాట? నీ ప్రశ్నల కన్నింటికీ సదుత్తరాలివ్వడానికి సంసిద్ధంగా ఉన్నానన్నమాట! ఒకవేళ నన్నేమీ అడక్కపోయినా సరే, నేను మాత్రం వూరుకోబోవడం లేదు...."

నిజానికి గురుమూర్తి గత జీవితాన్ని గురించి తెలుసుకోవాలన్న కుతూహలం సోమశేఖరంగారికి లేకపోలేదు. వీడు - గాలి తీసేసిన తోలుబొమ్మలా తయారైన యీ గురుమూర్తి...... చిన్ననాటి తరగతి గదిలో డస్కులో కూర్చునేవాడు. ముఖ్యంగా అయ్యావార్లను ఏడిపించడం వీడిపని. పాఠాలు వినిపించుకోడు. శ్రద్ధగా చదవడు. కాపీకొట్టి పరీక్ష పాసౌతాడు. కానీ కొన్ని కొన్ని కార్యకలాపాల్లో వీడి ప్రతిభ మెచ్చుకోతగ్గది. వక్తృత్వపు పోటీలో బహుమతి చెప్పి గెలుచుకునేవాడు. విచిత్ర వేషధారణలో వీడికి వీడే సాటి.

ఇలాంటి గురుమూర్తి గవర్నమెంటు పరీక్షలో కాపీకొట్టే వెసులుబాటు లేక ప్రతి పాఠ్యభాగంలోనూ సింగల్ డిజిట్ మార్కులు తెచ్చుకున్నాడు! ఆ తరువాత అతడేమయ్యాడో తనకు సరిగ్గా తెలియదు. గడిచిపోయిన నాలుగు దశాబ్దాల్లో అతడు తనకు ఏ నాలుగైదుసార్లు మాత్రమో కనిపించాడు. ఒకసారి మద్రాసు సెంట్రల్ స్టేషనులో ప్రత్యక్షమై ఏదో గడియారాల కంపెనీకి ఏజంటుగా తిరుగుతున్నానన్నాడు. మరొకసారి మైసూరు దసరా ఉత్సవాల్లో తటస్థపడి నీటి బుడగల్లాంటి మానవ జీవితాలను భీమా చేస్తున్నట్లు చెప్పాడు. ఇంకొకసారి యీ తెలుగుదేశంలోనే ఓ థియేటర్‌లో తారసిల్లి సినిమా అయిపోయేంతవరకూ తన దేశ పర్యటనానుభవాలను ఏకరువు పెట్టాడు. అన్నింటికన్నా పదిహేనేళ్ళకి మునుపు చివరిసారిగా ఇతణ్ణి కలుసుకున్న సంఘటన మరపురానిది. ఓ మిత్రుడి ఆహ్వానాన్ని పురస్కరించుకుని నెలరోజులు సెలవు పెట్టి తను ఉదకమండలానికి వెళ్లడం జరిగింది. సమయానికి ఆ మిత్రుడు యింట్లో లేకపోవడంతో బాగా నిరుత్సాహపడిపోయిన తనకు ఈ గురుమూర్తి వో పెద్ద రెస్టారెంటులో కనిపించాడు. కనిపించినవాడు రెండురోజుల పాటు తనను వదలిపెట్టాడుగాడు. డబ్బును మంచి నీళ్ళలా వ్యయంచేస్తూ నీతికీ, అవినీతికి మధ్య ఎర్రసిరాతో గీతగీసి మడిబట్ట కట్టుకోకుండా స్వేచ్ఛగా, సంతోషంగా బ్రతకటం, ఆనందాన్ని చుబ్బనచూరలాడడానికే నన్నంత ఉల్లాసంగా ఆ రెండు రోజుల్లో అతడు తనకు కొత్త కొత్త అనుభవాల్ని రుచి చూపించబోయాడు. కానీ ఎలాంటి పనికైనా తెగబడగల సాహసం తెచ్చిపెట్టుకుంటే వచ్చేది గాదన్న సత్యాన్ని రుజువు చేస్తూ ఈ స్నేహితుడికొక 'గుడ్‌బై' చెప్పి, తను సెలవు తీసుకున్నాడు.

"ఎలా మొదలెట్టాలో తోచడం లేదు. సోమశేఖరం!" ప్రసంగానికి ఉపక్రమణికగా లోపలికి పీల్చుకున్న రెండుగుక్కల పొగను బయటికి వదలిపెట్టాడు గురుమూర్తి. "పది పదిహేనేళ్ళకు మునుపొకసారి మనం కలుసుకున్నప్పుడు సహజంగా ఎన్నో విషయాలను గురించి మాట్లాడుకుని ఉంటాము. అప్పుడు నేను నా వ్యక్తిగత జీవితాన్ని గురించి ఏమైనా చెప్పి ఉంటే, ఆ చెప్పిన దాంట్లో నీకింకా ఏ ఒక్కటీ అరా విషయమైనా జ్ఞప్తిలో ఉంటే, దాన్ని నువ్వీ క్షణాన మరచిపోవాలి. ఎందుకంటే నేను స్వతహాగా ఆలోచించి మాట్లాడడానికి అలవాటు పడినవాణ్ణిగాను. పైగా ఒక నిజం చెప్పి అందుమూలంగా ఎదుటివాడికి కలిగే సందేహాల పరంపరకు సమాధానాలు చెబుతూ కూచోడమంటే నాకు చెప్పరానంత చిరాకు కలిగేది. అంచేత ముక్తసరిగా వో అబద్ధం చెప్పి ఆ ప్రమాదంలోనుంచీ తప్పుకునే వాణ్ణి. మచ్చుకొక విషయం చెబుతాను. నేను పెళ్లి చేసుకోలే దంటాననుకో! ఎందుకు చేసుకోలేదన్నది వెనువెంటనే ఉద్భవించే ప్రశ్న. కారణం గూడా చెబుతాననుకో! ఊఁహూ, ఎదుటివాడు చస్తే నమ్మడు. వాడికి వెయ్యి అపోహలు! ప్రేమించిన అమ్మాయిని పెళ్ళాడ్డానికి వీల్లేక పోయిందేమో! తనతోబాటు మరొక మనిషిని గూడా పోషించుకోగల తాహతులేక పోయిందేమో! లేదా, పెళ్ళయిన తర్వాత ఏవో కొన్ని కారణాల వల్ల ఆ పెళ్ళాంతో కాపురం పొసగిందికాదేమో! ఈ సందేహాల జల వట్టిపోయేదెప్పుడు? ఎందుకొచ్చిన గొడవని భార్యాబిడ్డలు వూళ్ళో ఉన్నారని చెప్పేసేవాణ్ణి....."

"ఐతే నీకు పెళ్ళే కాలేదన్నమాట?" విస్మయంతో అడిగారు సోమశేఖరంగారు.

"పెళ్ళి కాలేదు అనడంకన్నా, కాకపోవడానికి బాధ్యతంతా నాదే గనుక చేసుకోలేదనడం సమంజసం! ఎందుకు చేసుకోలేదంటే, ఇష్టంలేక! ఇష్టంలేకపోవడానికి గూడా కారణం చెబుతాను.... ధనార్జన అన్నది నాకెన్నడూ ఒక సమస్యగా తోచలేదు.

నీళ్లు త్రాగినంత సులభంగానూ, చుట్ట గాల్చినంత అశ్రమంగాను నేను డబ్బు సంపాదించగలిగాను. నిరంతర చలనశీలం కలిగింది డబ్బు. దాంతో ఎన్నెన్ని సౌఖ్యాలు పొందవచ్చునో తెలిశాక, నా జీవితం గూడా అలాగే, పరిణమించింది. మనోదౌర్బల్యమను, చంచల స్వభావమను వాంఛల్ని నేను చంపుకోలేదు. అసలు చంపుకోదలచలేదు. జేబు నిండుకూ గలగల లాడుతున్న డబ్బుతో సందడి, సంరంభం చెలరేగుతున్న బజార్లవెంట తిరుగుతూ ఏ వస్తువు కావలసివస్తే ఆ వస్తువు కొనుక్కుంటూ, ఎక్కడ ఆకలైతే అక్కడ భోజనం చేస్తూ ప్రతి వినోదాన్నీ, ప్రతి విలాసాన్నీ అందుబాటులో తెచ్చుకోగలుగుతున్నప్పుడు, మనసు పెళ్లి మీదికి, సంసారం మీదికి మళ్ళకపోవడంలో ఆశ్చర్యమేమీలేదు. సంసారమంటే అది జీవితాన్ని ఒక పరిమిత వలయంలో బంధించే చక్రంగా భావించాను. బస్సుకంటే, రైలుకంటే, విమానంకంటే వడిగా పరుగెత్తే జీవితం కోసం తపించాను. సంపాదించడానికీ, వ్యయం చేయడానికీ మధ్య నేనట్టే వ్యవధి పెంచుకోలేదు. దేశంలో ఈ చివరినుంచీ ఆ చివరి వరకూ నేను చూడని పట్టణంగానీ, రుచి చూడని సౌఖ్యానుభవంగానీ లేదని చెబితే చాలు. నా జీవితగాథను సంగ్రహంగా ముగించినట్టవుతుంది. ఒకసారి సిలోన్ వెళ్ళాను. రెండుసార్లు బర్మా వెళ్ళాను. కానీ ఏ మాట కామాటే చెప్పుకోవాలి. ఈ అరవైయేళ్ళ జీవితంలో నేను నిస్సహాయకరమైన పరిస్థితుల్లో పడిపోయిన సందర్భాలు సైతం లేకపోలేదు. జబ్బుతో సతమతమవుతూ, పలుకరించే దిక్కులేక, చేత పైసాలేక శారీరకంగానూ, మానసికంగానూ దుర్భరమైన యాతనకు గురైన ఘట్టాలు గూడా ఉన్నాయి. ఆ అనారోగ్యం నుంచి కోలుకుని మళ్ళీ నిలద్రొక్కుకోగానే లోకంపట్ల నాలో కక్షలాంటి భావం రగులుకునేది. అంతటితో యినుమిక్కిలిగా సంపాదించడానికి పూనుకునేవాణ్ణి. అందినదంతా ఆహరించివేసే ఆకొన్న తోడేలులా దేనికంటే దానికి డబ్బును వెదజల్లేవాణ్ణి...."

కాలపురుషుని వేడి నిట్టూర్పులాంటి సైరన్ మ్రోతతో గురుమూర్తి ప్రసంగం ఆగిపోయింది.

"వెళ్దామా గురుమూర్తీ! గంట ఎనిమిదైంది. ఈపాటికి యింటిల్లపాదీ నాకోసం వేచి చూస్తుంటారు. భోజనమైన తర్వాత తీరిగ్గా మాట్లాడుకోవచ్చు...."

"మాట్లాడుకోవడాని కింకేముంది, సోమశేఖరం! లేదంటే ఓ చిన్న విషయం చెప్పాలి. నిన్ననే ఓ డాక్టరుగారిని కలుసుకున్నాను. ఆయన తిరగవలసిన తిరుగుళ్ళన్నీ తిరిగేశాను గనుక ఇకమీదట నాకు విశ్రాంతి అవసరమన్నాడు..."

"విశ్రాంతికేం గురుమూర్తీ! నామట్టుకు నాకు విశ్రాంతి పుష్కలంగా లభిస్తోంది. దాన్ని నువ్వూ కాస్తా పంచుకుంటే నాకు మరికొంత కులాసాగా ప్రొద్దుపోతుంది..."

మిత్రులిద్దరూ పార్కు దాటుకుని, బాల్యస్మృతుల్లో మునిగి తేలుతూ మెల్లగా ఇంటివైపు నడవసాగారు.

* * *

పడుకున్నారే గానీ, సోమశేఖరంగారికి నిద్ర పట్టడం లేదు. అవును మరి! తటాకంలో రాయి పడితే ఏమవుతుంది? అలలు పైకిలేచి విస్తరించుకుంటూ వెళ్ళి ఒడ్డుకు తాకి వెనుదిరగడంతోబాటు క్రిందినుంచీ బుడగలు పైకొస్తాయి. గురుమూర్తి రాకవల్ల అంత పనీ జరిగింది. నిశ్చల కాసారంలాంటి సోమశేఖరంగారి మనసులోకి గండశిలలా దొర్లుకుంటూ వచ్చాడు గురుమూర్తి!

నిద్ర రాక,పడక పొందక అటూ ఇటూ ఒత్తిగిల్లి పడుకుంటూ జాగరణం సల్పుతున్న సోమశేఖరం గారి బుర్రలో ఆలోచనల తీవ్రత సుడిగాలిలా హోరెత్తి పోతోంది. తనకు అరవై యేళ్ళు నిండిపోయాయి. షష్టిపూర్తి సంబరాలు కూడా జరిగాయి. కొడుకులూ, కోడళ్ళూ, కూతుళ్ళు అల్లుళ్ళూ, మనుమళ్ళూ, మనుమరాళ్ళూ, తననూ, తన భార్యనూ మధ్యలో కూర్చోబెట్టుకుని గ్రూప్ ఫోటో తీయించుకున్నారు. అప్పుడు తనకది గర్వకారణంగా కూడా భాసించింది. అయ్యో, అవివేకం ఎంత చెడ్డది! దాని నిషాలో అంపశయ్య కూడా హంసతూలికాతల్పంలా కనిపిస్తుంది. కాకపోతే ప్రపంచ జనాభా లెక్కలకు అదనంగా మరికొన్ని అంకెలను, ఆ అంకెల గుణకారంతో మరికొన్ని సంఖ్యలను కలపడం కూడా ఒక గర్వకారణమేనా! జీవిత సార్థక్యాన్ని సంతాన సౌభాగ్యాన్ని బట్టి నిర్ణయించినట్టయితే మానవుడి కంటె మరికొన్ని ప్రాణులు ఎంతో నయం. అంతేకాదు. ఏవిధంగా చూచినా అడవులలో తిరిగే లేళ్ళూ, కుందేళ్ళూ, ఆకసంలో ఎగిరే పక్షులూ, సాగరంలో సంచరించే జలచరాలు తనకంటే మెరుగ్గానే బ్రతుకుతున్నాయి. వాటికున్నంత స్వేచ్ఛ తన కెక్కడేడ్చింది? ఆరు దశాబ్దాల సుదీర్ఘ జీవితంలో తనొక గోడ గడియారంలా బ్రతికాడు. తన దిన చర్యల్ని బట్టి ఎదుటివాడు టంచనుగా గంట చెప్పగలిగినంత యాంత్రికంగా బ్రతికాడు. ఐతే యంత్రానికీ, తనకూ ఒకటి రెండు విభేదాలు లేకపోలేదు. యంత్రానికి కోరిక లుండవు. తన కుండేవి కోరికలే. లేవు గనుక వాటిని తీర్చుకునే ప్రసక్తి యంత్రానికి లేదు. తను కోరికల్ని బలవంతంగా చంపుకున్నాడు!

వల్మీకంలో దాగి పడుకున్న భుజంగాలు ఒక్కొక్కటి మేలుకున్నట్టు,సోమశేఖరంగారి మనసులోపలి పొరల్ని చీల్చుకుని తీరని కోరికలు ఒక్కొక్కటిగా పైకి రాసాగాయి. ఒకసారి దేశం నలుమూలలా తిరిగి రావాలన్నది తన చిరకాల వాంఛల్లో ఒకటి. దేశాన్ని కాదుగదా, తను రాష్ట్రాన్ని గూడా చుట్టి రాలేకపోయాడు. ఒకప్పుడు లీవు దొరికేది గాదు. మరొకప్పుడు యింట్లో ఎవరికో ఒకరికి ఆరోగ్యం తిన్నగా ఉండేది కాదు. లేదా సమయానికి చేతిలో కావలసినంత డబ్బు మెదిలేది కాదు. కారణం ఏదైతే నేమి, గాడిలో కసువు తింటూ, కట్టుగూటం చుట్టూ తారట్లాడే దుక్కిటెద్దులా తాను సంసారం కూపం నుంచీ ఈవల పడలేకపోయాడు.... ఇరవై యేళ్ళ క్రితం జరిగిన సంఘటన. అప్పుడు తనొక పేట కొంపలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. ఆ ప్రాంతంలో కల్లా శ్రీమంతుడైన ఒక పెద్ద మనిషి అతడిలాంటి పెద్దలకు కొందరికి విందుచేస్తూ అందుకు తనను గూడా ఆహ్వానించాడు. నాలుకకు పట్టిన త్రుప్పును వదిలించిన విందు భోజనం తర్వాత, నాలుగైదు బుడ్లు టేబిలు పైకి వచ్చేశాయి. ఆ అనుభవ మెలాంటిదో తేల్చుకోదగిన మహదవకాశాన్ని కేవలం మొహమాటంతో తను నిరాకరించేశాడు. మళ్ళీ ఒంటరిపాటున ఎప్పుడైనా ప్రయత్నించి చూడాలనిపించేది. కానీ అందుక్కావలసిన తెంపు తనలో మృగ్యమైపోయింది. పోగా 'పాపం, హేయం' అంటూ తన మనసే తనను బెదరించడానికి పూనుకునేది. అవును, కోతకు వచ్చిన పొలం లాంటిది ఆనందం. అందులో ఆంక్ష, మనిషి అని భ్రమించడానికి వీలుగా చేసిపెట్టిన గడ్డిబొమ్మ లాంటిది. గడ్డిబొమ్మ కదలదు. మెదలదు. నోరు తెరచి అరవదు. అయినా దాన్నిచూస్తే భయమెందుకో తన కర్థంకాదు.... ఈ తీరని కోరికల్లో మరీ తాలోత్తాలంగా కనిపించేది రాజేశ్వరి! ఆవిడ తనకోసం ఎదురుతెన్నులు చూస్తూ ద్వారం దగ్గర నిలబడి ఉండేది. ఆమె కంటబడగానే తనొక పెద్ద శుకయోగీంద్రుడిలా తలవంచుకుని చరచరా వెళ్ళిపోయేవాడు. ఇంగితాన్ని గుర్తెరుగనట్టు

నటించిన ఈ పాషాణ విగ్రహానికి ఆమె జాబులు గూడా వ్రాసి చూచింది. ఐతే తను వాటిని చింపి బుట్టదాఖలు చేసి, భారీ ఎత్తున ఆత్మ నిగ్రహాన్ని ప్రకటించేవాడు.... అంతంత పెద్ద సంగతుల దాకా ఎందుకు? ఊళ్ళో మంచి సినిమా ఆడుతున్నా తను వెళ్ళలేక పోయేవాడు. ఫ్రీ పాసు వచ్చినా నాటకానికి పోలేకపోయేవాడు. కర్తవ్య నిర్వహణ అన్న పేరుతో తన బ్రతుకంతా చాకిరి చేయడంతో గడచిపోయింది. వీలైనంత వరకూ ప్రభుత్వం తనచేత చాకిరీ చేయించుకుంది. మిగిలిన ఓపికను కుటుంబం హరించేసింది.

ఐనా ఇంతకాలంగా తనకీ విషయం ఎందుకు తెలియక పోవాలి? సోమశేఖరం గారి ఆలోచనా స్రవంతి యిక్కడ కాసేపాగి మరొక వైపుకు మలుపు తిరిగింది. ఇప్పుడైనా ఈ ఆత్మ పరిశీలన అకారణంగా జరగడం లేదు. ఇందుకు కారణం గురుమూర్తి రాక. ఈ గురుమూర్తి ఎలాంటివాడు? కాళ్ళకు సంసారపు సంకెళ్ళు తగిలించుకుని బోర్లగిల పడనివాడు. మాటిమాటికీ లోకం ఏమనుకుంటున్నదోనని వెనుదిరిగి చూడకుండా తన ముక్కుకు సూటిగా నడిచి పోగలిగినవాడు. నీతులతో, నిషేధాలతో వేసిన అడుగడుక్కూ ప్రతిబంధకాలు కల్పించుకోకుండా తన స్వేచ్ఛకు విశాలమైన అవకాశాన్ని కల్పించుకున్నవాడు. అతడు చూడని దృశ్యాలు లేవు. రుచి చూడని సుఖాలు లేవు. నిజంగా గురుమూర్తి చరితార్థుడు. అతడి జీవితం సార్థకం!

సోమశేఖరం గారు చిరాకుతో పైకి లేచి వేశారు. గ్లాసు నిండుకూ మంచినీళ్లు త్రాగి వాలు కుర్చీలో పడుకున్నారు. గోడకు వ్రేలాడుతున్న జేబు గడియారంలో చిన్న ముల్లు పన్నెండు సమీపిస్తోంది. సోమశేఖరం గారికి కాస్త ఆశ్చర్యం గూడా కలిగింది. తనకెప్పుడో పడుకున్న అరగంట సేపటికే బాగా నిద్ర పట్టేది. అలాంటి ఈరోజు కన్నుపొడుచుకున్నా కునుకు రావడం లేదు. సామాన్యంగా నిద్ర పట్టక పోవడానికి కారణం అశాంతి. అశాంతికి కారణం అసంతృప్తి. అసంతృప్తి ఎందుకు కలుగుతుంది? మానని పుండ్ల లాంటి తీరని కోరికలు మనసును బాధించడంవల్ల! ఐతే మనిషి ఎంత త్వరగా నిద్రపోగలడో, ఎంత గాఢంగా నిద్రపోగలడో అంతగా అతడి మనసు చీకుచింతల నుండి విముక్తమై ఉంటుందన్నమాట! ఈ 'థియరీ' ప్రకారం యిప్పుడు గురుమూర్తి గాఢంగా నిద్రపోతుండాలి.

విచిత్రమైన కోరికే మరి! తమ సిద్ధాంతంలోని నిజానిజాలను అప్పటికప్పుడే తేల్చుకోవాలనుకున్నారు సోమశేఖరం గారు. లేచి బయటికి వచ్చారు. ఇటూ అటూ గదుల వరుస. మధ్యలో చీకట్లు ముసలుతున్న దారి.... మెల్లగా నడచి సందు చివరిదాకా వెళ్ళి కిటికీ దగ్గర నిలుచుని 'గురుమూర్తి, గురుమూర్తి' అంటూ సోమశేఖరంగారు మిత్రుణ్ణి రెండుసార్లు పలకరించారు.

నిశ్శబ్దంలో తమ పిలుపులు తప్పితే మరొక అలికిడి వినిపించింది గాదు.

తలుపుపైన చేయి వేశారు. రెక్క తలుపు సవ్వడి లేకుండా లోపలికి తెరుచుకుంది. గదిలో ప్రవేశించి సోమశేఖరంగారు లైటు వేశారు.

మంచంపైన, దోమతెర లోపల నిశ్చలంగా నిద్రపోతున్నాడు గురుమూర్తి.

తెర దగ్గరికి వెళ్ళి సోమశేఖరంగారు ఒకటి రెండుసార్లు బిగ్గరగా పిలిచి చూచారు. ఆ క్షణాన ఆయన చేస్తున్న పని ఆయనకే అసమంజసంగాను, హాస్యాస్పదంగానూ భాసించింది. చింతలు లేకపోవడంవల్ల నైతేనేమి, ఎడతెగని ప్రయాణాల బడలికవల్ల నైతేనేమి గురుమూర్తి ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నాడు. తన సిద్ధాంతం మాట దేవుడెరుగు, ఇక్కడనుంచీ వెళ్ళిపోవడం మంచిది.

వెనుదిరిగి ద్వారం దగ్గరికీ వస్తుండగా టేబిలుపైన ఓ కవరు కనిపించింది.

పైన తమ చిరునామా కనిపించడంతో ఆయన అప్రయత్నంగా కవరు చేతికి తీసుకుని, అందులో నుంచీ జాబును పైకి తీశారు.

నాలుగు మడుపులుగా మడిచి పెట్టిన కాగితాన్ని విప్పేసరికి 'ప్రియమైన సోమశేఖరం!' అంటూ జాబు ప్రారంభమై పోయింది.

సోమశేఖరంగారు ఒకసారి పడుకున్న గురుమూర్తి వైపు చూచారు. ఒకసారి చేతిలోని కాగితాన్ని చూచారు. ఆ తరువాత విస్మయంతో చదువుకు పోసాగారు.

"ఇది జాబు గూడా గాదు. సంజాయిషీ, ఈ సంజాయిషీ ఎందుకో నీకీ పాటికే తెలిసి ఉంటుంది. లేదా మరికొంత సేపటికి తెలుస్తుంది.

జాబనుకో, సంజాయిషీ అనుకో మొత్తంపైన దీన్ని నీకొక రహస్యం తెల్పడానికోసం ఉద్దేశిస్తున్నాను. ఒక జీవిత కాలమంతా వ్యయించి తెలుసుకున్న రహస్యం, కళ్ళెం వదలిపెట్టడంలో ఆనందం లేదు. కళ్ళెం బిగబట్టడంలోనే ఆనందం ఉంది. ఇదే నేను తెలుసుకున్న రహస్యం.

ఈరోజు సాయంత్రం పార్కులో నేనీ రహస్యాన్ని చెప్పి వుండవలసింది. కానీ నాలోని దురభిమానం చెప్పనిచ్చింది గాదు.

ఒక చిన్న ఉదాహరణ చెబుతాను,భోజనానంతరం తాంబూలం నమలడం లోకంలో పరిపాటి. నేనొకప్పుడదే పనిగా నమిలేవాణ్ణి. కానీ అందులో ప్రత్యేకతేమిటంటే నేను తడవ తడవకు సున్నపు మోతాదు ఎక్కువ చేస్తూ వచ్చాను. అందువల్ల ఏమైందో తెలుసా సోమశేఖరం? కొంత కాలానికి సున్నం నాలుకపైన పనిచేయడం మానేసింది. ఎంత సున్నం వేసినా తాంబూలం ఎరుపెక్కేది గాదు. అమాంతంగా ఓ వెలగకాయంత సున్నం తినేయవచ్చుననిపించేది. పోగా అంతటితో నాలుకకు మైసూరుపాకు, కారాబూందీ, కాకరకాయా అన్నీ ఒక్కలాగే రుచించేవి. తాంబూలంలో సున్నానికున్నట్టే ఈ ప్రపంచంలో మానవుడి స్వేచ్ఛకు గూడా ఓ హద్దుంది. ఆ హద్దు దాటిన స్వేచ్ఛ నిరుపయోగమేగాదు. అనారోగ్యకరం కూడా! సాధారణంగా ప్రతి మానవుడికీ ఆనందాన్ని సమకూర్చే వినోద ప్రదర్శనాలు, విలాస యాత్రలు, యాత్రాస్థల సందర్శనాలు, నాకు లేశమాత్రమైనా ఆహ్లాదాన్ని చేకూర్చలేకపోయాయి. రోజులు గడవనూ గడవనూ ఎంతవాన కురిసినా నీరు నిలువని యిసుక పర్రలా నా జీవితం బీడుపడిపోతూ వచ్చింది.

ఆశ్చర్యంగా ఉందా సోమశేఖరం? అయితే మరి కొంచెం విశదీకరిస్తాను.

నీకు తెలిసిన విషయమే. ఆకలైతే అన్నం తినడం వేరు. ఆకలైనా కాకపోయినా జిహ్వాలోలు పత్వానికి పరితర్పణంగా అయిన ఖాద్య పదార్థాలన్నీ మెసవడం వేరు. మొదటిది ఆరోగ్యానికి దోహదకరం. రెండోది విధ్వంసకరం. సంసారంలో ఉన్న పరిమితమైన స్వేచ్ఛకు, సంసారానికి బయట లభ్యమయ్యే విశృంఖలమైన స్వేచ్ఛకు ఉన్న విభేదం యిదే! తిండి మానేసి, చిరుతిండ్లకు అలవాటుపడి తిన్నదంతా వమనం చేసుకునే అజీర్ణ రోగిలా కాలక్రమాన నేను ప్రపంచంలోని ఏ సుఖాన్నీ ఆస్వాదించలేకపోయాను. కోరికైతే కొండంత ఉండేది. డబ్బు కూడా సమస్య గాదు. కానీ చిల్లులు పడి నీళ్ళు లోపలికొస్తున్న పడవను చుక్కాని, తెరచాప ఏం రక్షింపగలుగుతాయి?

మరొక ముఖ్యవిషయం చెప్పాలి సోమశేఖరం! ఎక్కడెక్కడ తిరిగినప్పటికి గువ్వ కూడా సాయంత్రమయ్యేసరికి తన గూడు చేరుకుంటుంది. ఆ గూడే లేకపోతే గాలివానలో

తన గతి అధోగతే నన్న విషయం దానికి బాగా తెలుసు. గువ్వమాటేమిటి, గొప్పగొప్ప గ్రహాలే నియమబద్ధంగా తిరుగుతున్నాయి. మానవుడు ఏర్పరచుకున్న నియమానికి మరొక పేరే సంసారం. తెలియమివల్ల ఆ నియమానికి లోబడి ఉండడం ఒక బాదరబందీగా భావించాను. తెలిసి వచ్చేసరికి అంతా నా చేయి దాటిపోయింది. అశాంతి. చిమ్మచీకటిలో, నల్లటి కొండల మధ్య దారిగానని పథికునికి గలిగే అశాంతి ఎలాంటిది? అలాంటి అశాంతిలో అలమటించి పోయాను.

తెలిసిందా సోమశేఖరం! ఆ అశాంతికి ఫలితమే నా యీ బాహ్యస్వరూపం. చూశావు గదూ! ప్రొద్దు పడమటికి వ్రాలీ వ్రాలక మునుపే జరాభారంతో వింటిదబ్బలా వంగిపోయాను. భూమిలోపల వేళ్ళు శిథిలమై పోయి చిటారుకొమ్మ నుంచీ మొదలుపెట్టి ఎండిపోసాగిన చెట్టులా చివికిపోయాను. వ్యాధుల పేరుచెప్పడమెందుకు సోమశేఖరం! చెబితే నువ్వు భయపడవచ్చు. అందుకనే సూచించాను.

ఇటీవల ఓ డాక్టరుగారిని కలుసుకున్నానని చెప్పాను గదూ! ఆయన ఎవరోగాని నిజాన్ని నిక్కచ్చిగా తేల్చి చెప్పేశాడు. ఒక ఊపిరితిత్తి చెడిపోయింది. రెండోదాన్ని గూడా బాగుచేసే స్థితి దాటిపోయింది. పరీక్షించి చూచిన తర్వాత డాక్టరుగారు ఒక క్షణంపాటు తనను తానే మరిచిపోయి యింత ఆలస్యంగా తన దగ్గరికి రావడం కంటే, నేరుగా 'మరొక చోటికి' వెళ్ళడం అతనికీ, నాకూ గూడా శ్రేయస్కర మనేశాడు.

నేనిప్పుడు ఆ 'మరొకచోటుకే' పయనం కడుతున్నారు సోమశేఖరం! కానీ ఆత్మాభిమానం దొడ్డది. జీవంలేనిదే అవుగాక, నా యీ భౌతికకాయాన్ని దిక్కులేని పీనుగగా చేయడం నాకిష్టం లేకపోయింది. నీలాంటి మిత్రుడికి లేనిపోని బాదరబందీ కలిగిస్తున్నందుకు చేతులు జోడించి క్షమించమని కోరడంకన్నా నేను చేయగలిగిందేముంది సోమశేఖరం! ఐనా అనాథ ప్రేత సంస్కారం వూరికేపోదు. కోటి యజ్ఞాల ఫలం లభిస్తుంది....."

కంపిస్తున్న చేతివ్రేళ్ళ మధ్యనుంచీ జాబు క్రిందికి జారిపోయింది. సోమశేఖరం గారు 'గురుమూర్తి, గురుమూర్తి' అని విలపిస్తూ మంచం దగ్గరికి పరుగెత్తి దోమతెర తొలగించారు. అక్కడ గురుమూర్తి భౌతికకాయం చల్లగా కట్టెలా పడి ఉంది!

● ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, 1965 ●